
ఓ౩మ్

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంథమాల :-29

మీ హితమేది



రచయిత :

పండిత మదనమోహన విద్యాసాగర్

అనువాదము :

శ్రీ లోక లక్ష్మీనారాయణ

ప్రకాశకులు :

శ్రీ కోటి కె. లక్ష్మయ్య

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు

ఆర్య సమాజము, దిల్‌సుఖ్ నగర్,

హైద్రాబాద్ - 500 060

మూల్యము రూ. 3-00

శ్రీవిద్యా బుక్ డిపోయందు లభించు


వైదిక సాహిత్య గ్రంథములు

1.	వైదిక సిద్ధాంత పరిచయము - మాలెనాగభూషణము	15.00
2.	పెళ్ళి ముచ్చట్లు- అన్నేకేశవార్యశాస్త్రి	3.00
3.	బ్రహ్మచర్యము- భావజుల కుమారస్వామి	1.00
4.	ముందడుగు - భావజుల కుమారస్వామి	1.50
5.	ఆర్యసమాజ నిమంత్రణము-భావజుల కుమారస్వామి	1.00
6.	నాస్తికునితో నాలుగుమాటలు-భావజుల కుమారస్వామి	1.00
7.	విద్యార్థి మరియు సదాచారము-భావజుల కుమారస్వామి	1.00
8.	దేవునకు మానవునకు గల అడ్డుగోడలు-టి. సూర్యనారాయణ	1.00
9.	వేదోపదిష్ఠ మానవకర్తవ్యము-పః రాజరత్నమాచార్యులు	1.00
10.	తేనీరు (చాయ) భయంకరవిషము-భావజుల కుమారస్వామి	1.00
11.	జీవిత సమస్యలకు సరియైన సమాధానము-భావజులకుమారస్వామి	1.00
12.	సంక్షిప్త సత్యార్థ ప్రకాశము-పఃరాజరత్నమాచార్యులు	10.00
13.	ఒకేమార్గము-లోకమల్లారి. మూలము. మహాత్మ ఆనందస్వామి	15.00
14.	వైదిక సుఖజీవనము. లోకమల్లారి 〃	8.00
15.	ఈశ్వర రహస్యసారము- ఆర్యనారాయణమూర్తి	23.00
16.	వేదములలో విజ్ఞానము-పః రాజరత్నమాచార్యులు	3.00
17.	దార్శనిక విచారము-వేదము. పఃరాజరత్నమాచార్యులు	2.00
18.	ద్రవిడ వేదభాష్యము. పః రాజరత్నమాచార్యులు	2.00
19.	సంధ్యోపాసనవిధి హింది 〃	5.00
20.	వైదిక సంధ్యోపాసన విధి. తెలుగు అన్నే కేశవార్య శాస్త్రి	6.00
21	బంగారు బాట దయానందునిమాట	3.00
22.	కర్మఫల సిద్ధాంతము	12.00

ఓ౩మ్

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంథమాల :-29

మీ హితమేది



రచయిత :

పండిత మదనమోహన విద్యాసాగర్

అనువాదము :

శ్రీ లోక లక్ష్మీనారాయణ

ప్రకాశకులు :

శ్రీ కోటి కె. లక్ష్మయ్య

సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు

ఆర్య సమాజము, దిల్‌సుఖ్ నగర్,

హైద్రాబాద్ - 500 060

మూల్యము రూ. 3-00

ఓ౩మ్

మా మాట

మనమంతా శాంతి-సౌఖ్యముల నభిలషించేవారము. వాటిని పొందుటకు సత్యజ్ఞానము, సాధన అవసరం. నేటి యుగమందు విద్య విజ్ఞానము లెంతయో అభివృద్ధి గాంచినవి. వాని సహాయమున సుఖ సాధనములను సమకూర్చుకొనవచ్చు. యేనకేన ప్రకారేణ వాటిని సమకూర్చుకొనుటే జీవిత పరమావధియైపోయినది. అందుచేత సమాజంలో నీతి-బాహ్యమైన వ్యవహారము సాగుతూ వుంది. శాంతి కరువైపోయినది. దీనికంతా కారణం - అజ్ఞానం - స్వార్థం.

వీటిని పారద్రోలుటకు సత్యజ్ఞానము - పరమార్థము నెరుగవలసిన ఆవశ్యకత ఎంతేని వుంది. ఈ సత్యము నెరిగిన మహర్షి దయానందులు సత్యజ్ఞాన మునకు నిలయమైన వేద - విజ్ఞానమును వెదజల్లుటకు కంకణం కట్టుకున్నారు. తదాశయ సిద్ధికై ఆర్య సమాజమును స్థాపించారు. మహర్షి అనుయాయు లెందరో చిత్త శుద్ధితో వేద ప్రచారము కోసం దేశ సేవకోసం అంకితమైపోయారు. కాని ప్రస్తుత పరిస్థితి వేరు. వేద ప్రచారము సన్నగిల్లుతూ వుంది. అనుదినమూ విద్వాంసులు, ప్రచారకులు కరువైపోతున్నారు. సాహిత్య సృజన అంతకంటే కొరవడుతూ వుంది. ఇట్టి విషమపరిస్థితి తిలకిస్తూ అభిమానులు గల ఆర్యులు నిట్టూర్పు విడుస్తున్నారు. ప్రయోజనం ?

అందుచే ఇట్టి తరుణంలో మనమంతా నిరాశానిస్పృహలతో నిట్టూర్పు విడిచేకన్నా కర్తవ్యోన్ముఖుల మగుట ఎంతేని అవసరం. ఎవరేమి చేయుచున్నారు అని విమర్శించే ముందు నేనేమి చేయుచున్నాను ? అని ప్రశ్నించుకుంటే బాగుంటుంది. చేతనైన నిర్మాణాత్మకమైన కృషి సలిపితే ప్రయోజనకారిగా వుంటుంది.

''సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు'' పై అభిప్రాయముతో జన సామాన్య మందు ధర్మ ప్రచారము చేయుటకు తగు సాహిత్యమునందివ్వాలని ఆరంభించబడిన ''సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంధ మాల'' యను శీర్షికన ఇట్టి సాహిత్యమును ప్రచురించదలిచాము. ఇందు వేదోక్త, వేదసమ్మత

అభిప్రాయములను వెలిబుచ్చు మూల రచనలు, అనువాదములు, లఘు పుస్తకముల రూపమున ప్రచురించబడును.

అందుచే ధర్మాభిమానులంతా మా యీ ప్రయత్నము నెరవేరుటకు చేయూతనిచ్చి ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాము. సహృదయ వైదిక సాహిత్య ప్రచురణ గ్రంధ మాల'' ప్రచురణ వ్యయములను భరించుట కొక చిన్న ప్రణాళికను రూపొందించాము. ఒక్కొక్క ప్రచురణ భార మంతా ఒకే వ్యక్తి లేదా సంస్థ భరించినట్లయితే, ఆ ప్రచురణ వారి పేరుతో వెలువడుతుంది..

''సహృదయ వైదిక సాహిత్య ప్రచురణల గ్రంధమాల'' సురభిత కుసుమముల నాఘ్రాణింప జేయుటకు మా యీ ప్రణాళిక మీకందరికీ నచ్చుతుందనే విశ్వాసంతో మీ సహాయ సహకారములు తప్పకుండా లభించగలవనే ఆశతో -

మీ సేవలో

కోటికె లక్ష్మయ్య.

ఓ౩మ్

తొలి పలుకు

''సుఖస్యమూలంధర్మః'' అను ఆచార్య చాణక్యోక్తి అందరూ ఎరిగినదే. ధర్మాచరణము ద్వారా సుఖప్రాప్తి కలుగు ననుటే దీనిభావము. భగవంతుడు, ధర్మము అను మాటల్లో విశ్వాసం గలవారు ప్రపంచములో కెల్లా భారతదేశమునందే అధికముగా నున్నారు. ఐనను ఇచ్చట సుఖము శాంతి నాస్తి. దారిద్ర్య దేవత విలయ తాండవం యిచ్చటనే జరుగుతుంది. దీనికంతటికి కారణం ధర్మమా ? ధర్మమంటే ఏమిటి ?

అనేక మతములు, సంప్రదాయములు ప్రవచించేదంతా ధర్మమా ? అను దినమూ అవతరిస్తూన్న భగవానులు (బాబాలు) వల్లించేది ధర్మమా ? లేక ధర్మము పేరిట జరిగే పూజా పునస్కారాలు, బాహ్య ఆడంబరాలు ధర్మమా ? ఒక వైపు ధర్మాత్ములుగా చెలామని అవుతున్న ఎందరో స్వప్రయోజకులు అమాయక ప్రజానీకానికి ధర్మ భ్రాంతిని కలిగించి వారిని మూఢ నమ్మకాలకు గురిచేస్తున్నారు. ఇంకొకవైపు భగవంతుడు, ధర్మము అనేవి వట్టి బూటకములనే దుష్ప్రచారము సాగిస్తున్నారు నాస్తికులు. ఏది ధర్మమో తెలియని అజ్ఞానతిమిరములో కొట్టుమిట్టాడువారు కోకొల్లలుగా వున్నారు. ఇట్టి తరుణంలో జ్ఞాన జ్యోతిని వెలిగించి, ధర్మము యొక్క నిజస్వరూపాన్ని తేటతెల్లం చేసే బాధ్యత విజ్ఞులపై వుంది. ఈ బాధ్యతా నిర్వహణకు పూనుకుంటేనే ధర్మము రక్షింపబడుతుంది. తద్వారా మనము రక్షింపబడుతాము. ధర్మాన్ని గూర్చి ఒక మాటలో చెప్పాలంటే ధర్మమంటే కర్తవ్యం. ఎట్టి కర్తవ్యాచరణ ద్వారా మనకు హితము (మేలు) కలుగుతుందో వివరించు ఈ చిన్ని పుస్తకము- ''మీ హితమేది, నిహితమై యున్నది''. ప్రఖ్యాత వేద విద్వాంసులు శ్రీ పండిత మదనమోహన విద్యాసాగర్ గారు సులభ గ్రాహ్యముగను, సరసమైనశైలి యందును రచించారు. శ్రీ లోక లక్ష్మీనారాయణ గారు అనువదించి యిచ్చారు. వారికి మేమెంతయో కృతజ్ఞులము.

ఇట్లు
ప్రకాశకులు.

ఆశీస్సులు

ధర్మ ప్రచారము రెండు సాధనముల ద్వారా జరుగుతుంది. సచ్ఛీలురైన ప్రచారకుల ద్వారా మరియు ఉత్తమమైన సాహిత్యము ద్వారా, ప్రచారకుని ఉత్తమ గుణ- శీలములను తిలకించి ప్రజలు ధర్మమహాత్మ్యము నెరిగి ధర్మాచరణకు ప్రేరితు లౌతారు. సద్గ్రంధముల స్వాధ్యాయము ద్వారా కూడ ప్రజలు ధర్మానురాగులౌతారు. అందుచే ప్రజలలో సచ్ఛీలతను పెంపొందించుటకు ఉత్తమ సాహిత్య సృజన ఎంతేని అవసరం. దేవ దయానందుని దివ్య సాహిత్యము ఇందుకు బాగుగా ఉపకరిస్తుంది. అట్టి సాహిత్య ప్రచారము పుణ్యకార్యమని నా అభిప్రాయము.

ఉత్సాహవంతులైన శ్రీ కోటి కె. లక్ష్మయ్య గారు ధర్మ ప్రచారార్థము, ''సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు'' శీర్షికన తెలుగు భాషయందు లఘు పుస్తకములను ప్రచురింప పూనుకున్నారని తెలిసి, నా కెంతయో ఆనందము కలిగినది. భగవంతుడు వారి ఈ ప్రయత్నము ఫలించునటుల జేయుగాక. ధర్మా భిమానులంతా వారిని ప్రోత్సహిస్తారని నా మనవి.

''మీ హితము, యిందే నిహితమై యున్నది''అను ఈ లఘు పుస్తకము అను నా కృతికి భాషాంతరము. ''సహృదయ వైదిక సాహిత్య ప్రచురణలు'' వారు దీనిని ముద్రించుటకు ఎంపిక చేశారు. ఇది రెండవసారి ముద్రింపబడుచున్నది. దీని అధ్యయనము ద్వారా ప్రజలలో ఏకొద్ది ధర్మజిజ్ఞాస కలిగినా, కర్తవ్య బోధ కలి గినా నా ఈ ప్రయత్నము, ప్రచురణ కర్తల ఉద్దేశ్యము ఫలించి నట్లు భావిస్తాను.

– మదన మోహన విద్యాసాగర్

మీ హిత మేది ?

మిత్రులారా ! మీ హిత మేదియో తెలిసికొనుడు

ఈ జన్మయందే సత్యమును తెలిసికొని, సత్యాచరణ మొనర్చి మీ సత్య రూపమును గ్రహింపుడు. సృష్టికర్తయు, సర్వజ్ఞుడు, సర్వ వ్యాపకుడు, సర్వ శక్తి మంతుడు, దేశకాలావధులు లేనివాడు, సర్వోపరిదివ్య చేతన శక్తి స్వరూపుడునైన పరబ్రహ్మమే అంతిమ సత్యము. అతని యథార్థ జ్ఞానమే మానవుని భవసాగరము నుండి తరింప జేయును. అతడే అంతిమ శరణ్యము. అతనిని తెలిసికొనిననే సమ స్తమును తెలిసికొనవచ్చును. ఈ యద్భుత సృష్టిలో జీవనోపయోగకరములైన సత్ప దార్థములను పొంది జీవితమున ఆనందాబ్ధి నోలలాడుచును జీవితమును, ''సత్యం, శివం, సుందరం'' గా నొనర్చుకొనుడు. మీ నిజస్వరూపమును గుర్తింపుడు. పొరపాటున శరీరమునే సర్వస్వమనుకొని ''అర్థ కామము'' - కామినీ కాంచనములం దాసక్తులై జీవితమును వ్యర్థమొనర్చుచున్నారు. ''ధర్మము'' - (సత్యా చరణ) మరియు ''మోక్షము'' (త్యాగభావన) లేని జీవనము, కాళ్ళు, తల నరుక బడిన ప్రాణి వంటిది. అది ముందుకు చూడజాలదు. నడువలేదు. అందువలన మిత్రులారా మీ హితమేదియో తెలిసికొనుడు. ఈ ప్రపంచమున మన అవాగమనము యొక్క ఉద్దేశమేమో తెలిసికొనుడు. ధర్మార్థ కామమోక్షము లనెడి నాలుగు పురుషా ర్థముల సాధించి పరమానందము ననుభవించుటవే మానవ జీవిత పరమోద్దేశము. పతిత పావనుడైన మహర్షి దయానంద సరస్వతి ఈ విషయమును తెలిపి ప్రపంచమునకు మహోపకారమొనర్చినాడు.

ధర్మము : మత మతాంతరములను ''ధర్మ'' మనజాలము. సత్య న్యాయాచరణము, పక్షపాత రహిత బుద్ధితో సమస్త ప్రాణులకు హితమొనర్చు భావనయే ధర్మమనబడును. ఇట్టి భావనవలన సర్వ భూతములందు ఆత్మ దర్శనము, తనయందు విశ్వదర్శన మగును. సామాజిక దృష్టితో ధర్మము యొక్క భావము ''పరోపకారముతో కూడిన త్యాగభావన'' యగుచున్నది.

అర్థము : రూపాయి పైసలనే ''అర్థ'' మనరు. జీవికానిర్వహణకు ధర్మానుకూల పద్ధతుల ద్వారా సమస్త పదార్థములను సంపాదించి, వాని ననుభవించుటయే ''అర్థ'' మనబడును. సామాజిక దృష్టితో దీని భావము ''సర్వోదయము కొరకేర్పడిన రాజ కీయు వ్యవస్థ'' యగుచున్నది.

కామము : ''కామ'' మన స్త్రీ పురుషులు కేవలము శారీరక సంబంధము కలిగి వాసనాతృప్తిని పొందుట కాదు. ధర్మార్థములతో ఇంద్రియ భోగముల ననుభవించుటే ''కామ'' మనబడును. సామాజిక దృష్ట్యా ఇది ''మానవ సమాజమున సదాచార రక్షణ కొరకేర్పడిన వివాహ వ్యవస్థ''.

మోక్షము : ''మోక్ష'' మనగా కేవలము జన్మమరణ బంధముల నుండి విడివడి పర బ్రహ్మ యందు శాశ్వతముగా లీనమగుట కాదు. సమస్త దుఃఖములనుండి విము క్తులై ఆనందము ననుభవించుటే ''మోక్షము''. సామాజిక దృష్ట్యా దీని భావము ''భావిసంతతి యొక్క ఉన్నతికి సాధనముల సమకూర్చుటకై ప్రాపంచిక సంబం ధముల త్యాగము, లేదా, సామాజిక బాధ్యతలనుండి నివృత్తులై సర్వోదయమునందు ప్రవృత్తులగుట''. ఈ జన్మయందే మీ రీ విషయముల నెల్ల గ్రహింపకున్న మహా వినాశహేతువగునని భావింపుడు. గంగానదియొడ్డున దప్పికతో మరణించిన విధ మగును. సత్యము నెఱుగు అవకాశము ఈ మానవ జీవితమునందే లభ్యమగును. ఇట్టి సువర్ణావకాశమును వదలుకొనకుడు. మిత్రులారా! మీ హితమేదో తెలిసికొనుడు.

ఈ భూతలమున మానవు డవతరించి అనంతకాలమైన దను తథ్యమును గ్రహింపుడు. సర్వేశ్వరుడైన దివ్యచేతన శక్తి దయాళువే కాదు, న్యాయకారి గూడా. అతని సమస్త కార్యములు నియమ బద్ధములై యుండును. ప్రాణులకు నివాస స్థాన ములైన సూర్య, చంద్ర, పృథి వ్యాదులను అతడు ప్రథమమున నుత్పన్న మొనర్చెను. పిదప వారి ఆహారమునకై శాక, వృక్ష, వనస్పతి, ఫలపుష్పాదుల సృజించెను. ఆ పిదప క్రిమికీటకాదులు, జలచర, స్థలచర, నభచరములు, పశుపక్షులు, గోవులు, వృషభములు, గుఱ్ఱములు, కుక్కలు, పిల్లులు మున్నగువాని నుత్పన్న మొనర్చెను. బుద్ధిజీవియైన మానవుడు సర్వోత్తమ ప్రాణి యగుట, వీటన్నిటితో అతడు తన జీవిత నిర్వహణలో లాభము పొందును గనుక వీటన్నిటి పిదపనే మానవుడు సృజింప బడెను. ఒకనాటి శుభోదయమున మన పూర్వీకులు హిమాలయ శిఖరము నుండి పైకి చూడగా నలువైపుల ఆనందమే ఆనందము – ''సూర్య వైభూమా'' వ్యాపించి యుండుట గాంచిరి. తమ చుట్టుగల ప్రాణులను గాంచి ముదిత మానసులైరి. తదాది వారు ఆనందమును స్థిర మొనర్ప యత్నింపసాగిరి. స్వస్తి, శాంతి, అభయము, అను నినాదముల నుద్ఘోషించిరి. మన పూర్వజులు, తూర్పు దిశనుండి పాడిన మధుర శాంతి గీతమును, తమతోగొని ప్రపంచమున వ్యాపించిరి. తరువాతి విషయమును గూడ తెలిసికొనుడు. ఇట్లు వెళ్ళినవారు క్రొత్త క్రొత్త జనపదములను నెలకొల్పిరి. స్థానిక పరిస్థితుల ననుసరించి వీరు తమ తమ సంఘములను జాతులను ఏర్పరచుకొ నిరి. వారు పరస్పరము కలిసి జీవించుటకై కొన్ని నియమ నిబంధనలను, విధానము

లను, ఆచార వ్యవహారములను, వేష భాషలను, నీతి నియమములను ఏర్పరచుకొనిరి. ఈ విధముగా ఎన్నియో సంస్కృతులు ప్రపంచమున వెలసినవి.

స్థూల దృష్టికి ఇవన్నియు భిన్నములై తోచినను సూక్ష్మ దర్శులకు సృష్ట్యారంభమున మన పూర్వజులు కనిపెట్టిన వీటన్నిటిని కలిపెడు ఆర్య సంస్కృతీ సూత్రమొకటి గోచరించును. మన మొకే కుటుంబమునకు జెందినవార మనియు, మన మందరిదీ ఒకే ఆర్య పరివార మనియు గ్రహించితిమేని మన పరస్పర ద్వేషభావము నశించి ప్రాణులందరిని మిత్రదృష్టితో చూడగల్గుదుము. సోదరుడు సోదరుని ద్వేషింప కుండును. సోదరి సోదరిని ఈర్ష్యతో చూడకుండును. ఏలన, మనుజుడు ప్రాణులన్నింటి యందు ఒకే ఆత్మ సూత్రమును గాంచి నంతనే అతని హృదయము నుండి అసహ్య భావము నశించును. అప్పుడే స్నేహమనెడి అమరజ్యోతి సర్వత్ర వెలుగొందును. ప్రపంచ మంతట స్వస్తి, శాంతి, అభయము యొక్క మార్గము సుగమమగును. కావుననే మిత్రులారా ! ఇదియే మీ హితము.

ఈ సత్యమును గుర్తించి ఒకే మానవ ధర్మమును. ఒకే సభ్యతను, ఒకే సంస్కృతిని, ఒకే దార్శనిక భావనా ధారను అంతట వ్యాపింప జేయుటకు యత్నింపుడు. చూడుడు. పూర్వము ప్రపంచమంతట వేదోక్తధర్మ మొకటే ప్రచలితమై యుండి, దానియందే నిష్ఠ కలిగి అందరును ఒకరి సుఖదుఃఖములను, హాని లాభములను తమవిగానే భావించుచుండిరి. అప్పుడు భూగోళమందంతటను సుఖమే యుండెను. కాని యిప్పుడెన్నియో మతమతాంతరములు ప్రబలి దుఃఖము, విరోధము వృద్ధియైనవి. దీనిని నివారించుట మీ పరమ కర్తవ్యము. విభిన్న సభ్యతలు, మతమతాంతరములు, ప్రపంచమున అశాంతిని, కలహములను, అవిశ్వాసమును వ్యాపింప జేసినవి. విభిన్న భాషలు, వేర్వేరు శిక్షణలు, వివిధ వ్యవహారములు - వీని యందలి విరోధములు తొలగనంతవరకు పరస్పరము సంపూర్ణ ఉపకారము సంభవము కాజాలదు. కాన మిత్రులారా ! మీ హితమేదో తెలిసికొనుడు.

వివేక శీలురుకండు: ఈ వివేకమే మిమ్ము అంధకారమునుండి ప్రకాశమునకు, అసత్యము నుండి సత్యమునకు మరియు మృత్యువు నుండి అమరత్వమునకు గొంపోవును. చూడుడు -

ఒకరు వచ్చి ఈ ప్రపంచమున చేతనత్వ మనునదే లేదు. అంతయు భౌతికము, జడమే యని ఘోషింప ప్రపంచము జడము వలె నై పోయినది.

మరొకరు వచ్చి ప్రపంచమంతట దుఃఖమే దుఃఖము కలదనియు సర్వము క్షణికమే యనియు చాటుటచే ప్రపంచమున దుఃఖము, నిరాశ వ్యాపించెను.

—

ఇంకొకరు వచ్చి ఈ ప్రపంచమున అందరు పాపులే. అందరు దుష్టులే, అజ్ఞానులే యని ప్రవచింప ప్రపంచమున పాపము, దుష్ట ప్రవృత్తి వృద్ధియై ఎన్నియో మతయుద్ధములు జరిగినవి.

వేరొక రేతెంచి ఈ ప్రపంచము మిథ్య యనియు, ఒకే చేతన సత్తాయే సర్వస్వమనియు ప్రచార మొనర్ప ప్రపంచమున జీవించు కోరికయే నశించి పాపము అలసత్వము, ప్రమాదము వృద్ధి గాంచినవి.

మరొకరేతెంచి మతమున వివేకమునకు స్థానమే లేదనియు, ప్రథమమున అందరునూ అసత్యవాదులే యని ప్రచార మొనర్ప ప్రపంచమున మూఢ సంప్రదాయ ములు ప్రబలి, పరస్పర పోరాటములు జరిగి రక్తపు నదులే ప్రవహించెను.

ఇంకొక రేతెంచి ధర్మము మరియు ఈశ్వరుని యందు నమ్మకమనవసర మనియు ప్రపంచమున జరుగుచున్న సంఘటన లన్నింటికి కారణము కామినీ కాంచనములే యని నుడువ ప్రపంచము అర్థము వెంట పరుగు లెత్తుచున్నది. స్వేచ్ఛా చారము ప్రబలినది. నీతి, మర్యాద, నష్టమైపోయి అంతట అవిశ్వాసము, అసంతోషము, కలహ ప్రవృత్తి వృద్ధియై ఎన్నియో మహా యుద్ధములు జరిగినవి. వీరందరును ఎవరి వాద్యములపై వారి రాగాలాపనల నొనర్చిరి. ప్రపంచమున విరోధము ప్రబలి, రక్తపాతములు జరిగి సామాజిక, ఆర్థిక, రాజనైతిక వైషమ్యములు వృద్ధియైన వి. ఈ మత మతాంతర వాదుల బంధనములనుండి విడి వడుడు. మత మతాంతర దాస్య విముక్తులగుడు. ధర్మ బుద్ధి మరియు విజ్ఞానము యొక్క ప్రకాశమున మీ జీవిత నౌకను భవసాగరమునుండి తరింప జేసికొనుడు. మిత్రులారా ! ఇందే మీ హితము గలదు.

ప్రపంచమున జడత్వమును నాశనమొనర్చి అమృతము గ్రోలజేయు మహాను భావు డవతరించినాడు. ప్రపంచమందలి విషము నంతటిని త్రాగిన శివుడాతడు. అతడు జ్ఞానము చేత అజ్ఞానమును నాశనమొనర్చెను. ప్రపంచమునుండి దుఃఖమును దూరపరచి ఆనందామృతాస్వాదన మొనరింప జేయు మహాపురుషుడవతరించినాడు. అంతకు పూర్వమెందరో ప్రజలను దుఃఖవిముక్తుల జేయుదుమని వాగ్దాన మొనర్చిరి. కాని వారీ ప్రపంచమున నిరాశ మరియు అకర్మణ్యతనే మిగిల్చిపోయిరి. కాని ఈ మహాపురుషుడు జ్ఞాన కర్మల సమన్వయము ద్వారా దుఃఖములను అత్యంత వినాశ మునకు గురిచేసి సుఖమనెడు సుధను త్రాగించునట్టివాడు. ప్రపంచ మానవుల పాప ములను తొలగించి ముక్తినిప్పించువా డే తెంచినాడు. ఎందరో పాపభారము వహింప దలిచిరి, కానీ విఫలులైరి. కేవలము చతురతను మాత్రమే ప్రదర్శింపగల్గిరి. కాని

యీ తడో ! స్వావలంబనతో కూడిన సదాచార మార్గమును ప్రదర్శించెను. ఈ మార్గము ననుసరించువా రందరు స్వయముగనే తరింప గల్గుదురు. మృతులను పునరుజ్జీవితుల నొనర్పువా డేతెంచినాడు. అతడు ప్రపంచమున సత్యమహిమను చాటి మిథ్యను రూపు మాపినాడు. అతడు సంసార సాగరమున మునిగియున్న వారి నుద్ధరించెను. ప్రపంచమున వసంతోదయ మయ్యెను. అజ్ఞానమును రూపుమాపు ప్రకాశపుంజము వెలువడినది. ఇక ప్రపంచమున విజ్ఞానవివేకములే రాజ్యమేలును. ప్రపంచ నేత్రములు తెఱుచుకొన్నవి. చెవులు నిక్కబొడిచికొని వినుచున్నవి. మత సంప్రదాయములు నశింపసాగినవి. ప్రపంచమున సత్యధర్మము యొక్క సుగంధము వ్యాపించుచున్నది.

మునిగిపోవువారిని ఆదుకొనువాడవతరించినాడు. ఎందరో వ్యక్తులు మానవులను తరింపజేయు పూచీ గైకొనిరి. కాని వారు అందరిని తమతో బాటు ముంచివేసిరి. విమతులైన వారిని ఆలింగన మొనర్చుకొనువాడే తెంచినాడు. ఎందరో ఆదరింతుమని వారిని తీయగా ఆహ్వానించిరి. కాని వందలాది జనుల కంఠముల నుత్తరించిరి. ఎందరినో ముక్తుల నొనర్చిన వాడవతరించినాడు. అన్యులెందరో ముక్తి ఆశ జూపి వందలాది జనులను లోబరుచుకొనిరి. కాని ఇతడు అజ్ఞానాంధులకు జ్ఞాననేత్రముల ప్రసాదించినాడు. దురభిమానము, మిథ్యా దురాగ్రహముచే బధిరులైన వారికి కర్ణముల ప్రసాదించినాడు. అదృష్టముపై నాధారపడి నిష్కర్మణ్యులై కుంటివారైన జనులకు కాళ్ళ నొసగినాడు. రామునిపై భారము వేసి తంబూర మీటుచు దిరుగు కబంధులకు హస్తముల ప్రసాదించినాడు. పిపాసార్తులై మృగమరీచికల వెంట పరుగులిడు ఆర్తులకు భోజన మిడినాడు. మిత్రులారా ! మీ హితము ఇందే నిహితమై యున్నది.

అతని మాట వినుడు. లెండు మేల్కొనుడు. సోమరి తనమును త్యజింపుడు. అత డేమి చెప్పుచున్నాడో వినుడు. ''సజ్జనులైనవారు ఇతరుల మరియు స్వీయ దోషములను దోషములుగనే, గుణములను గుణములుగనే గ్రహించి దోషములను పరిత్యజించి గుణములను గ్రహించి, గ్రహింపజేయవలెను. హఠమును ప్రదర్శించు వారి హఠమును, దురాగ్రహమును దూర మొనర్పవలెను. ఏలన మిథ్యా భావముల నిరోధింపకున్న ప్రపంచమున అనర్థము లెన్నియో వాటిల్లును. '' ఈ యనిశ్చిత క్షణభంగుర జీవితమున ఇతరులకు హాని కలిగించి స్వయముగ లాభరహితుడగుట, అన్యులను వంచించుట అధర్మ యుక్త వ్యవహారము నవలంబించి ధర్మయుక్త మతమును త్యజించుట మానవధర్మము కానేరదు. పక్షపాత బుద్ధితో

అసత్యమును గూడ సత్యమనుట, దోషయుక్తమైన స్వమతస్తుతి, ప్రచారముల నొన ర్చుచు గుణ యుక్తమైన అన్యమతములను నిందాహీనులకు గురిచేసి అవి అసత్యమైన వని నిరూపింప బూనుకొనుట, మనుష్యులను పెడదారిని పెట్టి, వివేకహీనుల నొనర్చి ఒకరికొకరిని శత్రువుల నొనర్చి వారు పోట్లాడి చచ్చునట్టి కృత్యము లొనర్చుట మానవ ధర్మమునకు బాహ్యమైనది.

''మానవులు న్యాయదృష్టి కలిగి వ్యవహరించు టుచితము. సత్యమును సత్యముగను, మిథ్యను మిథ్యగను ప్రతిపాదించుట సత్యార్థమును ప్రకటించు టగును. సత్యమును అసత్యముగను, అసత్యమును సత్యముగను ప్రదర్శించుట సత్యమన బడదు. ఏ పదార్థ మెట్లున్నదో దాని నట్లే చెప్పుట, వ్రాయుట, నమ్ముట సత్య మన బడును.'' ''మానవ జన్మ సత్యాసత్య నిర్ణయము చేయుటకును చేయించుటకును ఉద్దేశింపబడినదే కాని వాదవివాదము, విరోధము చేయుటకు, చేయించుటకు కాదు. పక్షపాత రహితుడు, నిస్వార్థుడునై సత్యాసత్యము, కర్తవ్యాకర్తవ్యము, ధర్మాధర్మము, శుభాశుభములను చక్కగా నిర్ణయించి సత్యమును, కర్తవ్యమును నైన కర్మలను నమ్ము టయు నమ్మించుటయు, అసత్యమును, అకర్తవ్యమును నైన కర్మలను త్యజించి త్యజింప చేయుటయే మానవత్వమగును. కావున సర్వ జనహితమును దృష్టియందుంచుకొని సత్య విజయమునకు అసత్యక్షయమునకు మిత్ర భావమున వాదము, లేఖనము, ఉప దేశము చేయుటయే మానవ ధర్మము. అప్పుడే మనుజుడు తన బుద్ధి ననుసరించి స్వయముగా తన హితాహితమును సులభముగా గ్రహించి సత్యమును స్వీకరించి మిథ్యను త్యజించి సదా పరమానందము నొందును. ఏలన సత్యోపదేశము కన్న అన్య మైన దేదియు మానవజాతి ఉన్నతి, ఉపకారము, ఆనందమునకు కారణము కాజాల దు. మానవజాతి నుండి మిథ్యా మతమతాంతరముల పరస్పర విరుద్ధ వాద వివాద ములు తొలగనంతవరకు పరస్పర మానందము కలుగ జాలదు. మానవులందరు ఈర్ష్య, ద్వేషము, దురాగ్రహము, అవిద్యాది దోషములను త్యజించి సత్యాసత్య వివే కముద్వారా సర్వమానవ కల్యాణ సిద్ధికొరకు సత్యమును గ్రహించి అసత్యమును పరి త్యజించి, పరిత్యజింప జేసినచో ఇది యసాధ్యము కానేరదు. ఏలన మనుజుని యాత్మ సత్యాసత్య నిర్ణయ సామర్థ్యమును కోరికను కలిగియున్నది. ఇదియే అతడు మనన శీలుడనుటకు లక్షణము. మిత్రులారా ! మీ హితమును గనుడు.

ఈ యమృతవాణి నాలకించి తదనుకూలాచరణ మొనర్చుడు. ఎన్ని కష్టములెదురైనను సత్యమును దృఢముగ పాలింపుడు. అసత్య మతముల త్యజించి సత్యమైన వేదధర్మమును స్వీకరింపుడు. మీరందరు పరస్పరము ధర్మానుసారముగను,

ప్రీతి పూర్వకముగను, యథాయోగ్యముగను వ్యవహరింపుడు. సర్వకార్యములను సర్వశక్తి మంతుడైన దివ్య చేతనునకు సమర్పించి యొనర్పుడు. నిత్యము అతని స్తుతిప్రార్థనోపాసనముల నొనర్చుచు యజ్ఞమయ జీవితమును గుడుపుడు. మాతాపితరులను, గురువులను, పితరులను, సాధు సత్పురుషులను ఆప్త పురుషులను అన్న వస్త్రాదులచే సత్కరింపుడు. ప్రతి దినము శ్రాద్ధ తర్పణముల నొనర్పుడు! తమతో కలిసి నివసించువారితో పరస్పర సహకార భావముతోను, స్నేహపూర్వకముగను వ్యవహరింపుడు. పిన్నలపై, దీనదుఃఖితులపై స్నేహ వర్షమును కురిపింపుడు. పశుపక్ష్యాదులపై దయ కలిగి అందరితో సమానముగ వ్యవహరింపుడు.

సదా అహింసాపరులగుడు. పశుపక్ష్యాదులందును మానవులందున్నట్టి ఆత్మయే కలదు. వానిపై దయాభావము కలిగి యుండుడు వానిని హింసింపకుడు. ఆవు పరమ పవిత్రమైనట్టి ఉపయోగకరమైన ప్రాణి. కావున దాని సేవ యొనర్పుడు. కాని దస్యులను, దుష్టులను, పాపులను, అధర్మపరులను అణచివేయుడు, అట్లొనర్చిన దుష్కృత్యములు నశించి, సజ్జనరక్షణ జరిగి భూగోళమందంతటను ధర్మ స్థాపన జరుగును. ప్రపంచమునుండి, సమాజము నుండి దేశద్రోహులను, ఘాతకులను దొంగలను, దోపిడి కాండ్రను, హింసకమృగములను నాశన మొనర్పుడు. పరమేశ్వరుని మహిమను తెలిసికొనుడు. అతడు మనందరిపై కృపాదృష్టి కలిగి మనకీ యుత్తమమైన మానవజన్మను ప్రసాదించినాడు. ఇది భోగ యోనియే గాక కర్మయోని గూడ. మనము పూర్వ జన్మలయం దొనర్చిన కర్మలకు ఫల మనుభవింపవలసి యుండును. ఇదియే ప్రారబ్ధము. మనకు కర్మ చేయు స్వాతంత్ర్యము గూడ కలదు. ఇదియే జీవుని 'స్వతంత్ర ఇచ్ఛ'. ఈ సృష్టియందు దుఃఖితులు, సౌఖ్యవంతులు, నిర్ధనులు, ధనవంతులు, దుర్బలులు, బలవంతులు, మూర్ఖులు, విద్వాంసులు మున్నగు రూపముల గోచరించు భేదములకు కారణము మనము (జీవులు) చేసి కొన్న విభిన్నములైన మంచి - చెడు కర్మలే.

మన మెట్టి కర్మల నొనర్తుమో అట్టి ఫలమునే - అనగా శుభాశుభ కర్మలకు న్యూనాధికముగానట్టి సుఖదుఃఖాత్మక ఫలమును - తప్పక అనుభవింపవలసి యుండును. ఈశ్వరుడు మన పాపములను, క్షమింపడు, మన పాపముల భారము మనమే మోయవలసి యుండును. దానిని మరొకని తలనెక్కించుట అధర్మము, అన్యాయము కాగలదు. ఇతరులకు మేలు చేకూర్చుటయే మానవధర్మ మగును గాని హానిని కలిగించుట కాదు. పరమేశ్వరుని పూజ, సాధు సత్పురుషుల సాంగత్యమువలన పాప వాసనలు నశించి పాపము నుండి విముక్తి లభించును. దయామ

యుడైన పరమాత్మ ధర్మ మొనర్చుటకు, వివేకాదుల వృద్ధికి తగు సాధనములను మనకు సమకూర్చి పెట్టినాడు. మనము పూర్ణ పురుషార్థ పరులమై వాని నుపయోగించు కొనినచో ఈశ్వరుడు తన సర్వ సామర్థ్యముతో మనపై కృపాదృష్టి జరపును. మనకు సన్మార్గమును ప్రదర్శించును. మీరు పురుషార్థముతో సత్యాచరణ మొనర్చుడు. పురుషార్థము చేయని దరిద్రులపై, సోమరులపై అతని కృపా దృష్టి ప్రసరింపదు. ఎట్లన కన్నులు గలవానికే ఏ వస్తువునైన చూపగలము కాని అంధునకు చూపజాలము గదా ! కావున మిత్రులారా ! మీ హితమును దెలిసికొనుడు.

స్వీయ, రాష్ట్రోన్నతికై ప్రతిదినము :

ఆత్మ చింతనము, స్వాధ్యాయము, ఈశ్వరపూజ ద్వారా అంతఃకరణ శుద్ధియు, యోగాభ్యాసమును చేయుడు. దీని వలన విద్య, ధర్మము, శిష్టాచారము పెంపొందును. ఆసన ప్రాణాయామములద్వారా మీ శరీరములను, ఇంద్రియములను ఆరోగ్యవంతముగ నొనర్చుకొనుడు. అగ్ని హోత్రము ద్వారా వాయుశుద్ధి యొనర్చి గృహములను స్వాస్థ్యకరములుగ నొనర్చుడు. దీనివలన ఆరోగ్యము, బుద్ధి, బలపరాక్రమములు పెంపొందును. మాతాపితరులను, వృద్ధ జనులను అన్నవస్త్రాదులచే సత్కరింపుడు. అట్లొనర్చినచో సదాచారము, కృతజ్ఞతాభావము వృద్ధి చెందును. ధార్మికపురుషులను, జ్ఞానులను, సాధుసంన్యాసులను అన్నవస్త్రాదులతో సత్కరింపుడు. దీని వలన సత్యజ్ఞాన ప్రాప్తియు, ధర్మవృద్ధియు జరుగును. జీవ జంతువులు, నిర్ధనులు, అసహాయులు, నిరాశ్రితులు నైన వారిని యథా యోగ్యముగ పోషింపుడు. దీనివలన ప్రాణులన్నింటి యందు సమదృష్టియు, పరోపకార భావనయు వృద్ధియగును.

గర్భాధానము మొదలుకొని అంత్యేష్టిపర్యంతముగల (పదునారు) సంస్కారములను మీ గృహములందు యథావిధిగ జరుపుకొను ఏర్పాట్లొనర్చుడు. మానవజాతి పూర్వజులగు మను మొదలగు ఋషులు మనుజుని శరీరము, మనస్సు, ఆత్మలను బలిష్ఠ మొనర్చి వాటిపై ఉత్తమ సంస్కారములు, శుభసంకల్పముల ప్రభావము పడునట్లు వీని నావిష్కరించిరి. వీని నందరు చేయగల్గుదురు. మరుగున పడిపోయిన యీ సంస్కారములను పునఃప్రచార మొనర్చిన మహర్షి దయానంద సరస్వతి యొక్క ఉపకారమును మరువకుడు. ఇందే మీ హితము గలదు. జీవితమును ఉన్నత మొనర్చుటకు ఈ సంస్కారములు సర్వోత్తమమైన సాధనములు. వీనివలన శరీర – ఆత్మలు సుసంస్కృతములై ''ధర్మ-అర్థ-కామ-మోక్షము'' ల సిద్ధి సుగమమగును. కావున వీనిని విధి ననుసరించి తప్పక పాలించుట మనుష్యులందరకు ఉచిత

ము. కర్మలొనర్చుచునే శతవర్షములు జీవించుటకు దృఢసంకల్పమొనర్చుకొనుడు. మానవ జీవితము పూర్ణముగా సఫలమగునట్టి కార్యక్రమము ఏర్పడు రీతిలో దీనిని విభజించుకొనుడు.

జీవితపు ప్రథమ భాగమున మీ సంతానమును, పురుషుడైన కనీసము 25 సంవత్సరముల వరకు, కన్యయైనచో 16 సం॥లు లేక వివాహ మగువరకు బ్రహ్మచర్య పూర్వకముగ విద్యాభ్యాసము జేయింపుడు. జీవితపు ద్వితీయభాగమున విద్యాది సమస్త వ్యవహారముల సిద్ధిని బడయుటకు నియమపూర్వకమైన వైవాహిక జీవితమును గడుపుడు. దేశమందు సమాన గుణ, కర్మ, స్వభావములుగల యువతీ యువకుల వివాహ వ్యవస్థను ప్రచలిత మొనర్చుడు. జన్మను బట్టి యేర్పడిన జాతి బంధనములను, వరకట్నాదులను నిర్మూలింపుడు. జీవితపు తృతీయ భాగమున - అనగా 50,55 సం॥ల వయస్సు పూర్తి కాగానే - సాంసారిక బంధములను తొలగించుకొని తపః స్వాధ్యాయములతో కూడిన జీవితమును గడుపుడు. జీవిత అంతిమ భాగమున సమస్త ప్రాపంచిక సంబంధములను త్రెంచుకొని, పూర్ణవిరక్తులై పరోపకారమునకు, బ్రహ్మోపాసనకు జీవితము నంకిత మొనర్చుడు. మిత్రులారా ! మీ హితము ఇందే నిహితమై యున్నది.

ఈ సువిశాల, సార్వజనిక, సార్వభౌమ ధర్మమును ప్రచార మొనర్చుడు. మహర్షి దయానంద సరస్వతి దీని ప్రచారము కొరకే ఆర్యసమాజమును స్థాపించెను. ఆర్య సమాజము యొక్క సిద్ధాంతములు, కార్యములు మానవజాతి కెంత యుపయోగకరమైనవో మీరే యోచింపుడు. ఆర్య సమాజముద్వారా నడుపబడు కార్యకలాపములతో దేనితోనైనను మీరు సమ్మతిని కలిగి యుండి సర్వోదయ సిద్ధాంతము నంగీకరింతురేని ఈ సంస్థతో కలిసి దేశము మరియు మానవజాతి యొక్క ఉన్నతి కుద్దేశింపబడిన దాని కార్యకలాపములందు పాల్గొనుడు. ఆర్య సమాజ క్షేత్రము ఎంతటి విశాలమైనదన పరోపకార భావన గల ప్రతివ్యక్తియు దీనియందు జేరి పరిస్థితి ననుసరించి తన మనస్సునకు నచ్చిన కార్యము నెన్నుకొనవచ్చును.

మాంసభక్షణము, జీవహింస, గోవధ, మద్యపానము మున్నగు వాని నిషేధమునకై మీరు కృషి చేయదలచినచో ఆర్యసమాజముతో కలిసి ఈ కుకర్మలను విశ్వమునుండి తొలగింప యత్నించుడు. దేశములో, ప్రపంచములో వ్యాపించియున్న అవినీతి, అనాచారము, చీకటి బజారు మున్నగునవి మీకు కంటక ప్రాయమనిపించుచో ఆర్యసమాజముతో బుజములు కలిపి ధర్మము అనగా సదాచారము, న్యాయ పూర్ణ వ్యవహారము మరియు మానవ సేవా సిద్ధాంతములను ప్రచారమొనర్చుడు. నాస్తికత,

అవైదికత అనగా అజ్ఞానము యొక్క దుష్పరిణామములు మీ మనస్సున నాటి నప్పుడు గూడ ఆర్యసమాజము మీకు కార్యక్షేత్రము కాగల్గును. అందు మీ కత్యుత్తమమైన సాహిత్యము లభించును. దానిని చదివి ఈ విశ్వమందు మీ కార్యమును పూర్ణ మొనర్పగల్గుదురు. ''సత్యార్థ ప్రకాశము''ను చదివినచో మీ సంశయములన్నియు నశించి హృదయగ్రంథి విచ్చుకొనును. ''కుల, వర్ణ, జాతి, మత'' ముల పేరిట ప్రచలితమును, ప్రసిద్ధమునైన ఉచ్చనీచ భేదములను ఈ విశ్వము నుండి నశింపజేయదలచినచో మీకు ఇచ్చట లభించునన్ని సౌకర్యములు మరే సంస్థలోను లభింపవు.

స్త్రీజాతి యున్నతిలో మానవ సమాజోన్నతి యిమిడి యున్నదని మీరు భావింతురేని ఆర్యసమాజమున మీకెంతటి విశాలకార్యక్షేత్రము లభించునో మరే యితర సంస్థయందు లభింపదు. అనాథులు, నిరాశ్రయులు, పీడిత ప్రజలు మున్నగువారి సేవ యొనర్పమీరు సంకల్పించితి రేని నిజమైన నిష్కామ సేవకులు మీకు ఆర్యసమాజ మందే లభింతురు. మీరు మీ యాధ్యాత్మికోన్నతిని కాంక్షింతురేని దానికి గూడ ఆర్య సమాజము అత్యుత్తమ సామగ్రిని, వైజ్ఞానిక యోగపద్ధతిని మీకు అర్పించును. వ్యక్తి తన జీవితమును సమున్నతమును, సుఖవంతమును నొనర్చుకొనుటకు మార్గమును చూపుటతోనే మహర్షి తృప్తిపడలేదు. ఈ యాదర్శములను, నియమములను, సిద్ధాంతములను, ఆధారముగా గొని భూమండలములోని సమస్త రాజ్యములు తమ తమ రాజ్యములను నిర్మించుకొనినచో సమస్త విశ్వజన కల్యాణము జరిగి సుఖ జీవన స్థాపనకాగలదని మహర్షి ప్రేరేపించెను. ప్రస్తుత దుర్బల పరిస్థితిలో భారతదేశమున కీ నియమము, ఆదేశము అక్షరశః అత్యంతోపయోగమైనది.

మహర్షి యొక్క తపోబలము, ఆత్మత్యాగము, ధర్మము, మానవప్రేమ అద్భుతబలిదానము – ఇవన్నియు సహస్రకంఠములతో అభ్యుదయ నిఃశ్రేయసముల యొక్క ఉజ్జ్వల, జ్యోతిర్మయ రాజపథమును మీకు నిర్దేశించుచున్నవి. దీనిపై నడచిన మానవులెల్లరు అమరత్వమును, శాశ్వత శక్తిని పొందగల్గుదురు. ఈ ప్రకాశ స్తంభము యొక్క జ్యోతియందు పరమధామము నకు మార్గము లభించును. ఈ దృఢనౌక యందు కూర్చొనిన భవసాగరమును తరించుట సుగమమగును. ఈ విమానమున యాత్ర చేయుట వలన నిర్విఘ్నముగ పరమ ధామము చేరుకొన గల్గుదురు. ఈ కల్పవృక్షము క్రింద విశ్రమించినచో పురుషార్థ చతుష్టయము యొక్క మధుర ఫలముల రుచి లభించును. ఈ యాకాశము క్రింద స్వాతంత్ర్య సుఖ పవనము ప్రాప్తించును. ఈ నది యందు పయనించిన భవసాగర తీరమును చేరుకొనుట సంభవమగును. ఈ సూత్రమును పట్టుకొనినంతనే పరమతత్త్వముతో అనుప్రాణితులు కాగల్గుదురు. కావున – మిత్రులారా! ఇందే మీ హితము నిహితమై యున్నది.

ఈ యాస్తిక, సార్వభౌమ, ధర్మ ప్రచారక సంస్థలో సభ్యులై తమ

యొక్కయు, విశ్వము యొక్కయు శారీరక, మానసిక, ఆత్మిక, సామాజిక ఉన్నతి లో భాగస్వాములు కండు. ఏలయన ఆర్యసమాజము అందరికి మేలు చేయునట్టి సంస్థ. ఇది యా మహామహుడు, సుచేతుడు, సుకృతుడునైన మహర్షి దయానంద సరస్వతిద్వారా నిర్దిష్టమై ''ఓ౩మ్'' ధ్వజమును గైకొని విశ్వమందు సమానత, భ్రాతృభావన, స్వాతంత్ర్య విజయఘోష యొనర్చుచున్నది. దీనిని చదివినట్టి, వినినట్టి వ్యక్తియొక్క జీవితమార్గము ప్రశస్తమగును. దీనిని ప్రచారము చేయువాడు పుణ్యాత్ము డనబడును., దీనిని ఆచరణలో పెట్టువాడు పుణ్యఫలభాగుడగును. అతని ఇహప రలోకములు బాగుపడును. అతడు జననమరణ బంధనముల నుండిముక్తుడై అమరత్వము ను పొందును. ఈశ్వర సాన్నిధ్యమున స్వతంత్రతాపూర్వకముగ సుఖము ననుభవించును.

ఆర్య సమాజ దశ నియమములు

1. సమస్త సత్య విద్యలకును విద్యచే నెఱుఁగబడు పదార్థములకును ఆది మూలము పరమేశ్వరుడు.
2. ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వశక్తి మంతుడు, న్యాయ కారి, దయాళువు, అజన్ముడు, అనంతుడు, నిర్వికారుడు, అనాది. అనుపముడు, సర్వాధారుడు, సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అజరుడు, అమ రుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు సృష్టి. అతనినే ఉపాసించ దగును.
3. వేదము సమస్త సత్య విద్యల పుస్తకము, వేదమును చదువుట చదివించుట వినుట, వినిపించుట ఆర్యులందరి పరమ ధర్మము.
4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును, సర్వదా సంసిద్ధులై ఉండవలయును.
5. సమస్త కార్యములను ధర్మానుసారముగా అనగా సత్యాసత్యములను ఆలోచించి చేయవలెను.
6. ప్రపంచమున కుపకార మొనర్చుట అనగా శారీరక, ఆత్మిక మరియు సామాజిక ఉన్నతిని చేకూరుచట ఈ సమాజము యొక్క ముఖ్యోద్దేశ్యము.
7. అందరితో ప్రేమపూర్వకముగా, ధర్మానుసారముగా, యథాయోగ్యముగా వ్యవ హరించవలయును.
8. అవిద్యను నశింపజేసి, విద్యను పెంపొందిప వలయును.
9. ప్రతివ్యక్తి తన ఉన్నతి తోనే సంతుష్టుడు గాక, అందరి ఉన్నతిలో తన ఉన్నతి యని తలంచవలయును.
10. మనుష్యులందరు సామాజిక - సర్వహితకరములగు నియమములను పాలించు టలో పరతంత్రులుగా నుండవలయును. మరియు వ్యక్తి హితకరములగు నియ మములందు అందరు స్వతంత్రులుగా నుండ దగును.


శ్రీ విద్యా బుక్ డిపో సుల్తాన్ బజారు,

హైద్రాబాద్ వారియందు లభించు వైదిక సాహిత్య గ్రంథములు

దిక సిద్ధాంత పరిచయము.	మాలె నాగభూషణము	15.00
ళ్లిముచ్చట్లు,వైదిక వివాహ సంస్కారము.	అన్నెకేశవార్యశాస్త్రి	3.00
బ్రహ్మచర్యము.	భావజులకుమారస్వామి	1.00
ముందడుగు.	భావజులకుమారస్వామి	1.50
ఆర్యసమాజ నియంత్రణము.	భావజులకుమారస్వామి	1.50
స్తికునితో నాల్గుమాటలు.	భావజులకుమారస్వామి	1.00
ద్యార్థి మరియు-సదాచారము.	భావజులకుమారస్వామి	1.00
వునకు మానవునకు గల అడ్డుగోడలు.	టి. సూర్యనారాయణ	1.00
దోపదిష్ట మానవకర్తవ్యము.	పండితరాజరత్నమాచార్యులు	1.75
తేనీరు (చాయ), భయంకర విషము	భభావజులకుమారస్వామి	1.00
జీవిత సమస్యలకు సరియైన సమాధానము.	భావజులకుమారస్వామి	1.50
బుద్ధివికసించుటెట్లు.	భావజులకుమారస్వామి	1.00
సంక్షిప్తసత్యార్థప్రకాశము.	పం॥రాజరత్నమాచార్యులు	10.00
ఒకే మార్గము.	మహాత్మ ఆనందస్వామి	15.00
వైదిక సుఖజీవనము. లోకమలహరి (మహాత్మ ఆనందస్వామి)		8.00
ఈశ్వర రహస్యసారము.	ఆర్యనారాయణమూర్తి	23.00
వేదములలో విజ్ఞానము.	పండిత రాజరత్నమాచార్యులు	3.00
దార్శనిక విచారము-వేదము.	పండితరాజరత్నామాచార్యులు	2.00
ద్రవిడ వేదభాష్యము.	పండితరాజరత్నమాచార్యులు	1.00
సంధ్యోపాసన విధి.	పండితకేశవార్యశాస్త్రి	5.00
సంధ్యోపాసనావిధి-హింది		5.00
సత్యార్థప్రకాశము, 10 సముల్లాసములు	పండిత విశ్వమిత్రగారు	18.00
నమస్తే.	లోకామల్లరిగారు	4.00
వైదిక సామ్యవాదము.	లోకామల్లరిగారు	5.00
వేదజ్ఞానము.	లోకామల్లరిగారు	3.00

ఓ౩మ్

రచయిత పరిచయము



లోకామల్లారిగారు సిద్ధాంతాచార్యులు

జననము : **29-12-1911**

జననీ, జనకులు :- లోకా వెంకమ్మ, లోకా లక్ష్మయ్య

జన్మస్థలము: బీబీపేట, దోమకొండమండలుము, ఇందూరు జిల్లా, ఆం॥ ప్ర॥

విద్యార్హతలు : తెలుగు ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రవేశపరీక్ష, హింది ఉత్తమ, సిద్ధాంతాచార్య, (వైదిక) ఉర్దూ పండిత్. మున్షి నిజామియా, తెలుగులో యస్. జి. బీ. టి. ప్రశిక్షితులు.

వృత్తి :- అధ్యాపనము, వైదిక ధర్మప్రచారము. పౌరోహిత్యము,

రచనలు :- వేదముల అనువాదము (తెలుగులో), వేదముల యథార్థస్వరూపము మరియు వందకు పైగా లఘుగ్రంథముల అనువాదము.

DTP AT UM GRAPHICS, NARAYANGUDA, HY, PH.3222632